రైతులు మోసపోకుండా చూడాలి

మెట్‌పల్లి: పసుపును పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్
- మెట్‌పల్లి మార్కెట్‌లో పసుపు కొనుగోళ్లు పరిశీలన

మెట్‌పల్లి, మార్చి 6: పసుపు రైతులు మోసపోకుండా క్రయ, విక్రయాలపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు కొనుగోళ్ల తీరును గురువారం ఆయన పరిశీలించారు. మార్కెట్‌లో అమ్మకానికి పెట్టిన పసుపు కుప్పల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. పసుపులో రకాలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, దిగుబడి ఎంత వచ్చింది, మార్కెట్‌లో లభిస్తున్న ధర, తదితర వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. పసుపు కొనుగోలుకు సంబంధించి ఆన్‌లైన్‌లో వేలం, ట్రేడ్ లైసెన్స్‌దారు కోడ్ చేసే విధానం పరిశీలించారు. ట్రేడ్ లైసెన్స్‌దారులు, కమీషన్ ఏజెంట్లతో మాట్లాడుతూ, రైతుల నుంచి పసుపు కొనుగోలు చేసే తీరును అడిగి తెలుసుకున్నారు. దళారుల ప్రమేయం ఏమైనా ఉందా, ప్రస్తుతం మార్కెట్‌లో పసుపుకు ఏ విధమైన ధర పలుకుతున్నదని అడిగారు. కాడి రకం క్వింటాల్‌కు రూ. 8 వేల నుంచి రూ. 10 వేలు, గోళ రూ.7 వేల నుంచి రూ. 8 వేలు, చూర రూ. 6 వేల నుంచి రూ. 7 వేలు పలుకుతున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. వ్యాపారులు కొనుగోలు చేసిన పసుపును ఎక్కువగా మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానంగా పసుపుకు మద్దతు ధర సమస్య తీవ్రంగా ఉందని పలువురు రైతులు తెలుపగా మద్దతు ధర అంశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ పుల్యూరి నవీన్, మార్కెటింగ్ శాఖ అధికారులు, పసుపు రైతులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

మెట్‌పల్లి టౌన్, మార్చి 6: ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియలో వేగం పెంచాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలను టౌన్ ప్లానింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మోహన్, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి

జగిత్యాల, మార్చి 6: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు సిద్ధం కావాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురాతన ఉన్నత పాఠశాలలో గురువారం ఆయన 'జయీభవ, విజయీభవ' అని ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించి, పదో తరగతి విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభవుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ప్రిపేర్ కావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాధికారి రాము, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తల సంఘం రాష్ట్ర నాయకులు

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

జగిత్యాల, మార్చి 6: జిల్లాకు చెందిన ఆశ కార్యకర్తపై లైంగిక దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆశ కార్యకర్తల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ (ఆశ వర్కర్స్ యూనియన్) ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. అధికారులు స్పందించకపోవడంతో కలెక్టరేట్ నుంచి ర్యాలీగా ప్రధాన రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేపట్టారు. రోడ్డు మొత్తం నాలుగు వైపులా దిగ్బంధనం చేశారు. దీంతో అదనపు కలెక్టర్ లత, డీఎస్పీ రఘు, డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్, ఇతర అధికారులు ఆశ కార్యకర్తల సంఘం నాయకులతో చర్చలు జరిపారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని, పరిహారం కింద రూ.5 లక్షలు, కలెక్టర్ నిధుల్లోంచి తక్షణ సాయం కింద రూ. 50 వేలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, స్థలంతో పాటు ఇల్లు కట్టించే ప్రయత్నం చేస్తామన్నారు. ఆశ కార్యకర్తల వద్దకు డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్ వచ్చి మాట్లాడారు. మెడికల్ విభాగం నుంచి కూడా కొంత ఆర్థిక సాయం అందిస్తామని, ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి ఆందోళనను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బాలకృష్ణ, ఆశ కార్యకర్తల సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు ఇందూరి సులోచన, కార్యదర్శి మమత, జిల్లా నాయకులు దివ్య, వనిత, జ్యోతి, గాయత్రి, ప్రేమలత, సీపీఎం నాయకులు తిరుపతి నాయక్, మహిపాల్ నాయక్, వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి

అంతర్జాతీయ మహిళా దినోత్సవం

జగిత్యాల టౌన్, మార్చి 6: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులను శాలువాలతో సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలోని మహిళా ఉద్యోగులకు టీఎన్జీవో అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెసా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్, టీఎన్జీవో నాయకులు మహమూద్, సాహెబ్ బాబు, రాజేందర్, రాములు, రాజేశం, మధుకర్, శ్రీనివాస్, స్వామి, హరిప్రసాద్, ప్రమోద్, శరత్, చంద్రిక, మమత, శైలజ, శ్రావణి, ఎం శైలజ, విజయలక్ష్మి, రమ్య, అర్షియా నాజ్, ఆమని, అనుపమ, లలిత, రేఖారాణి, కళ్యాణి, కవిత, ప్రియదర్శిని, జయసుధ, శ్రావణి, పద్మావతి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో రఘువరన్

కూలీలకు సదుపాయాలు కల్పించాలి

పెగడపల్లి, మార్చి 6: వేసవిలో ఉపాధి హామీ కూలీలకు సదుపాయాలు కల్పించాలని డీఆర్డీవో రఘువరన్ సూచించారు. బతికపల్లి గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. బుధవారం ఉపాధి పనులు చేస్తుండగా కూలీలకు పురాతన నాజేలు దొరకగా, ఆ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, పని స్థలాల్లో కూలీలకు నీడ, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని వన నర్సరీని పరిశీలించారు. మొక్కల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో అనిల్‌కుమార్, ఈసీ రమాపతి, టీఏ నాని, ఎఫ్ఏ మహేశ్వరి పాల్గొన్నారు.

చికిత్స కోసం వెళ్తే..

- స్ట్రెచర్ లేక అరగంట పాటు క్షతగాత్రుడు అంబులెన్సులోనే
- జగిత్యాల ప్రభుత్వ దవాఖానలో ఘటన

అంబులెన్సులో క్షతగాత్రుడిని తీసుకొచ్చిన కుటుంబసభ్యురాలు

జగిత్యాల, మార్చి 6: చికిత్స కోసం వెళ్తే స్ట్రెచర్ లేక అరగంట పాటు క్షతగాత్రుడిని అంబులెన్సులోనే ఉంచిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గురువారం మధ్యాహ్నం 108 అంబులెన్సులో కాలు విరిగిన ఓ వ్యక్తిని తీసుకువచ్చారు. అంబులెన్సు డ్రైవర్, ఈఎంటీ స్ట్రెచర్ కోసం దవాఖానలోకి వెళ్లారు. కాగా, అరగంట అయిన రాకపోవడంతో క్షతగాత్రుడు రోదిస్తుండగా, పక్కనే ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో వైరల్‌గా మారింది.

లాంగ్వేజ్ పండిత్‌ను తొలగిస్తూ ఉత్తర్వులు

జగిత్యాల టౌన్, మార్చి 6: జిల్లా కేంద్రంలోని ఖాజీపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లాంగ్వేజ్ పండిత్ (ఊర్దూ) ఫహీమ్ జహాన్‌ను సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాధికారి రాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయురాలు నవంబర్ 1, 2022 నుంచి అనధికారికంగా విధులకు గైర్హాజరవుతుండగా లాంగ్వేజ్ పండిత్‌గా ప్రభుత్వ సర్వీసు విధుల్లోంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

బీడీ కార్మికులకు కూలి పెంపు

జగిత్యాల, మార్చి 6: వెయ్యి బీడీలకు కూలి రూ. 261.97కు పెంచినట్లు తెలంగాణ స్టేట్ బీడీ కార్మిక సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు మోత్కురి సుధీర్ కుమార్, ప్రధాన కార్యదర్శి సిలువేరి కిష్టయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెంచిన కూలి ఏప్రిల్ 1 నుంచి బీడీ కంపెనీల యాజమాన్యాలు చెల్లిస్తాయని పేర్కొన్నారు.

బీమా చెక్కు అందజేత

చిన్న గంగారాం కుటుంబసభ్యులకు బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

కథలాపూర్, మార్చి 6: కథలాపూర్ మండలం కలికోట గ్రామానికి చెందిన మార్కం చిన్నగంగారాం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాగా, చిన్నగంగారాం తపాలా శాఖలో రూ. 520 చెల్లించి బీమా కట్టారు. బీమా సొమ్ము రూ. 10 లక్షలు మంజూరు కాగా, గురువారం బాధిత కుటుంబసభ్యులకు తపాలా శాఖ అధికారులు చెక్కు అందజేశారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

కథలాపూర్, మార్చి 6: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఉపాధి హామీ నిధులు రూ. 1.23 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు గురువారం తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను 19 పనులుగా విభజించి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలపై నిరసన

జగిత్యాల టౌన్, మార్చి 6: కాంగ్రెస్ సర్కారు రైతు, విద్యార్థి వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా వద్ద గురువారం బీజేపీ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి, జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, నలువాల తిరుపతి, గుంటుక సదాశివం, జుంబర్తి దివాకర్, కొక్కు గంగాధర్, ఓరుగంటి చంద్రశేఖర్, పిల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి

కొడిమ్యాల, మార్చి 6: నల్లగొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త చెన్నాడి సత్యనారాయణరావు ఇటీవల మృతిచెందారని, ఆయన స్థానంలో కుటుంబ సభ్యులకు బాధ్యతలు అప్పగించవద్దని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ గురువారం పూడూర్ సింగిల్ విండో వైస్ చైర్మన్ సావనపల్లి రమేశ్ వినతి పత్రం అందజేశారు. సొంత డబ్బులతో ఆలయ నిర్మాణంతో పాటు ఆలయానికి భూమి విరాళంగా ఇచ్చిన వారిని మాత్రమే వంశ పారంపర్య ధర్మకర్తగా నియమించాలని, చెన్నాడి సత్యనారాయణరావు ఆలయానికి భూమి, డబ్బులు ఇవ్వలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తున్నదని తెలిపారు.

పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్‌లో నినాదాలు చేస్తున్న రైతు ఐక్య వేదిక సంఘం నాయకులు

- అన్నదాతలంతా మహాధర్నాకు తరలిరావాలి
- రైతు ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి

మల్లాపూర్, మార్చి 6: పసుపు రైతుల సమస్యల పరిష్కారం కోసమే రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న మెట్‌పల్లిలో రైతు మహాధర్నా నిర్వహించనున్నట్లు రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంతో పాటు కొత్త దాంరాజ్‌పల్లిలో గురువారం ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం కింద మార్క్‌ఫెడ్ సంస్థ ఆధ్వర్యంలో పసుపుకు కనీస మద్దతు ధర కల్పించి, బోనస్ అందించాలన్నారు. గత సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 16 వేల నుంచి రూ.18 వేల వరకు మద్దతు ధర పలికిందని, ఈసారి రూ. 8 వేల నుంచి రూ.11 వేల మద్దతు ధర రావడం బాధాకరమన్నారు. గ్రామాల్లోని రైతులు పార్టీలకు అతీతంగా మహాధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో సంఘం రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, మండల అధ్యక్షుడు డబ్బ రమేశ్‌రెడ్డి, నాయకులు కాటిపల్లి గంగారెడ్డి, తురగ శ్రీధర్‌రెడ్డి, బండెల మల్లయ్య, కొమ్ముల సంతోష్, కాటిపల్లి ఆదిరెడ్డి, మామిడి రాజశేఖర్‌రెడ్డి, పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, కల్లెం మహిపాల్‌రెడ్డి, కాసారపు భూమారెడ్డి, సంగ రాజన్న, పూండ్ర లక్ష్మారెడ్డి, లింబారెడ్డి, మోహన్, రాజిరెడ్డి, దివాకర్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కోరుట్ల రూరల్, మార్చి 6: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారిపై గురువారం రాస్తారోకో చేపట్టారు. బీజేపీ నాయకులు డాక్టర్ రఘు, ఒడ్డెపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్, మార్చి 6: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యువ పార్లమెంట్-2025 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ బీఎస్ లత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ముందుకు రావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ అరిగెల అశోక్ మాట్లాడుతూ, కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ప్రోగ్రాం అధికారుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల జిల్లా పరిధిలో నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలను చేర్చినట్లు పేర్కొన్నారు. 18 నుంచి 25 సంవత్సరాల్లోపు విద్యార్థులు, యువత ఈనెల 9వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకొని, నిమిషం నిడివి గల వీడియోను రికార్డ్ చేసి మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేసుకోవాలని తెలిపారు. 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అంశంపై మాట్లాడాలని సూచించారు. జిల్లా స్థాయిలో పది మందిని ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి అసెంబ్లీ హాల్లోకి పంపిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపికైన వారు జాతీయ స్థాయిలో పార్లమెంట్ హాల్లో ప్రసంగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం పట్టణంలోని ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి రాజు, సాయి మధుకర్, గోవర్ధన్, శ్రీనివాస్, సురేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన దళిత హక్కుల పోరాట సమితి కార్యవర్గ సభ్యులు

పెగడపల్లి, మార్చి 6: పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామంలో గురువారం దళిత హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోదుంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా మచ్చ అంజయ్య, ఉపాధ్యక్షులుగా మోదుంపల్లి లక్ష్మణ్, ఎండపల్లి భాస్కర్, సంయుక్త కార్యదర్శులుగా మహంకాళి కిరణ్, మోదుంపల్లి నర్సయ్య, కోశాధికారిగా ఆరెల్లి కనకయ్య ఎన్నికైనట్లు తెలిపారు.

రామ్‌సాగర్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల వివరాలు అధికారులను అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ జీఎస్ లత

కొడిమ్యాల, మార్చి 6: మండలంలోని రామ్‌సాగర్ గ్రామాన్ని గురువారం అదనపు కలెక్టర్ బీఎస్ లత సందర్శించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ రమేశ్, ఎంపీవో సతీశ్, ఆర్ఐ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

రాయికల్, మార్చి 6: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన అల్లీపూర్ ప్రీమియర్ లీగ్-4ను ఆమె తిలకించారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బర్కం మల్లేశ్, ప్యాక్స్ చైర్మన్ రాజలింగం, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, కార్యదర్శి రత్నాకర్ రావు, నాయకులు వెంకటేశ్, మహేశ్, ప్రశాంత్, రాజిరెడ్డి, వేణు, ప్రవీణ్, జగదీశ్, తదితరులున్నారు.

క్రీడాకారులతో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

హత్య కేసులో నిందితుల పట్టివేత

జగిత్యాల రూరల్, మార్చి 6: మండలంలోని టీఆర్‌నగర్‌కు చెందిన ఎస్‌కే రఫీ(28) ఈనెల ఒకటిన రాత్రి పెద్ద కెనాల్ పక్కన అనుమానా స్పదస్థితిలో మృతి చెందాడు. కాగా, ఎస్‌కే రఫీని కొట్టి చంపిన టీఆర్ నగర్‌కు చెందిన మహ్మద్ రంజానీ, షేక్ మహ్మద్, షేక్ శాదఫ్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల రూరల్ ఇన్‌చార్జి సీఐ నీలం రవి తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 6: ధర్మపురిలో ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. స్వామి వారి కల్యాణం నిర్వహించే స్థలాన్ని గురువారం ఆయన అధికారులు, అర్చకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కోరుట్ల రూరల్, మార్చి 6: అక్రమంగా మట్టి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి జైసింగ్ హెచ్చరించారు. ఐలాపూర్, ఏకీన్‌పూర్ గ్రామాల్లోని మట్టి గుట్టలను గురువారం ఆయన తహసీల్దార్ ఇట్యాల కిషన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జైసింగ్ మాట్లాడుతూ, అక్రమంగా మట్టి తరలిస్తే జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేయర్ కుమార స్వామి, ఆర్ఐ రాజేందర్‌రావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

కొడిమ్యాల, మార్చి 6: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఎస్పీ అశోక్‌కుమార్ సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై మాల్ ప్రాక్టీస్ కేసు

జగిత్యాల టౌన్, మార్చి 6: ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇద్దరు, కోరుట్ల బాలికల జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్‌లో 6387 మంది విద్యార్థులకు గానూ 6259 మంది హాజరు కాగా, 128 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

జగిత్యాల టౌన్, మార్చి 6: జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఉన్న పది మంది చీఫ్ సూపరింటెండెంట్లు, పది మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు జారీ చేసిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని కోరుతూ తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంటర్ బోర్డు కార్యదర్శి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌కు ఆన్‌లైన్‌లో వినతి పత్రం సమర్పించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొట్టాల తిరుపతిరెడ్డి, అత్తినేని శ్రీనివాస్ గురువారం తెలిపారు. ప్రశ్నపత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు, సమాధాన పత్రాలను పరీక్ష కేంద్రాల నుంచి పోస్టాఫీసులకు ఫోర్ వీలర్ వాహనాల్లో కాకుండా, త్రీవీలర్ వాహనాల్లో తీసుకెళ్లిన 20 మంది పరీక్షల నిర్వహణ సిబ్బందికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేయడం బాధాకరమని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఒక సెషన్ డ్యూటీ నిర్వహించినందుకు గానూ సీఎస్‌కు రూ. 352, డీవోకు రూ. 313 చొప్పున ఇంటర్ బోర్డు రెమ్యూనరేషన్ చెల్లిస్తుందని, ఫోర్ వీలర్‌కు రూ.188 చెల్లిస్తుందని వివరించారు. సొంత వాహనాలు లేని వారు ఫోర్ వీలర్‌ను ఎంగేజ్ తీసుకోవాలంటే రోజుకు కనీసం రూ. 1000 అవసరమవుతుందని, ఇది పరీక్షల నిర్వహణ సిబ్బందిపై అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు.

వివాహ వేడుకకు చల్మెడ హాజరు

మేడిపల్లి, మార్చి 6: మండలంలోని పోరుమల్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు నారాయణగౌడ్ కూతురు వివాహం గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు భూంరెడ్డి, రత్నాకర్‌రావు, హరిచరణ్‌రావు, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, అజిత్‌రావు, మకిలి దాసు, తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

వెల్గటూర్, మార్చి 6: వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటలోని నాగపల్లి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ధర్మపురిలోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, నాయకులు పూదరి రమేశ్, కుమ్మరి వెంకటేశ్, అన్నమనేని సత్యనారాయణరావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్, మార్చి 6: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామంలో సమతా సైనిక్ దళ్ శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ప్రతినిధులు ఆవిష్కరించారు. కోరుట్లలోని రారాజు ఫంక్షన్ హాల్‌లో ఈనెల 8, 9వ తేదీల్లో సమతా సైనిక్ దళ్ శిక్షణ తర